పాతబస్తీలో నేరాలకు అడ్డుకట్ట వేయాలి :రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, అక్కడ లా అండ్ ఆర్డర్ నిస్తేజంగా మారిపోయిందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ చేస్తుంటే వారిపై మజ్లిస్ ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎంఐఎం విషయంలో స్పందించడంలేదన్నారు. పాతబస్తీలో నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విధ్వంసకర ప్రాజెక్టును ఉపసంహరించాలి

● ఫార్మాసిటీని రద్దు చేసి మెగాసిటీని తేవద్దు : ప్రొ. దేసర్దా


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికవేత్త ప్రొఫెసర్ హెచ్.ఎం దేసర్దా

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీని రద్దు చేసి దాని స్థానంలో విధ్వంసకర ప్రాజెక్టును తీసుకురావటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని మహారాష్ట్ర రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు, ఆర్థికవేత్త ప్రొఫెసర్ హెచ్.ఎం దేసర్దా డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ బాబు రావు, పర్యావరణవేత్త కవుల సరస్వతి, టి.శివప్రసాద్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. తాను రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ఫార్మాసిటీ బాధిత గ్రామాల్లో వ్యవసాయం చేస్తూ, అనేక రకాల పంటలు పండిస్తున్నారని, పశుసంపద కూడా చాలా ఉందని తెలిపారు. ప్రస్తుతం మెగాసిటీ అని భూమి తీసుకుంటే సమస్య మళ్లీ మొదటికి వస్తుందన్నారు. ప్రకృతి సిద్ధంగా జరుగుతున్న వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థని ప్రోత్సహించాలని అన్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి


కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బంది

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బందికి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టు ఎంబీబీఎస్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మూడు నెలలుగా జీతాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఐ.ఐ.హెచ్. ఎఫ్.డబ్ల్యూ) కార్యాలయంలో డీఎంహెచ్‌ఓలు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా ఐదవ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రతినిధుల బృందం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

హర్షశ్రీకి ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు



హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని నంద్యాల ఎన్జీవోస్ కాలనీకి చెందిన తొమ్మండ్రు గురు హర్షశ్రీకి ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు లభించింది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివిన ఆమె 991 మార్కులు సాధించి తెలంగాణలో మూడో ర్యాంకు సాధించారు. అయితే ఈ ఏడాది జరిగిన తెలంగాణ లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో 71వ ర్యాంకు సాధించిన హర్షశ్రీ.. తాజాగా ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు సాధించారు. లా పూర్తిచేసిన తర్వాత జ్యుడీషియల్ సర్వీస్‌లో చేరడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

అరబిక్‌లో సయ్యిదా మర్యమ్ గజాలకు డాక్టరేట్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో అరబిక్ భాషా శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సయ్యిదా మర్యమ్ గజాల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అరబిక్‌లో డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని గ్రంథాలయాల్లో ఉన్న 'హదీసు చేతిరాత ప్రతుల విశ్లేషణ' అంశంపై పరిశోధన చేసిన సయ్యిదా మర్యమ్ గజాల సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. కాగా, ఉస్మానియా అరబిక్ విభాగాధిపతిగా వ్యవహరిస్తున్న సీనియర్ ప్రొఫెసర్ సయ్యిదా తలత్ సుల్తానా ఆమెకు పర్యవేక్షకుడిగా వ్యవహరించారు.

సివిల్స్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో క్రిష్ణప్రదీప్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. అకాడమీ చైర్మన్ క్రిష్ణప్రదీప్ మాట్లాడుతూ యూపీఎస్సీ-2025లో నిర్వహిస్తున్న సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆప్షనల్ ఎంపికపై 7 రోజులపాటు ఉచిత తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఐటీకారిడార్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.భరత్‌కుమార్‌ను సూరారం పోలీస్‌స్టేషన్‌కు, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణమోహన్‌ను మాదాపూర్‌కు, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్‌ను జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓగా, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తును కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కె.క్యాస్ట్రోను రాజేంద్రనగర్ ఎస్‌హెచ్‌ఓగా, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్‌ను షైలార్‌దేవ్‌పల్లికి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.భూపాల్ శ్రీధర్‌ను చేవెళ్ల ఎస్‌హెచ్‌ఓగా, మేడ్చల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహను షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మారెడ్డిని ఐటీ కారిడార్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కు, శంకరపల్లి, మోకిల పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేస్తున్న అందోల్ నాగరాజును అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, జీడిమెట్ల డీఐగా పనిచేస్తున్న విజయ్‌నాయక్‌ను మాదాపూర్ డీఐగా, మాదాపూర్ డీఐ రమేష్‌నాయుడును చేవెళ్ల డీఐగా, మేడ్చల్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ కొచ్చర్ల రవిని అత్తాపూర్ డీఐగా, షైలార్‌దేవ్‌పల్లి డీఐగా పనిచేస్తున్న గొల్ల తిమ్మప్పను మేడ్చల్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. షైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావులను సైబర్ క్రైం ఠాణాకు, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ బి.నాగేంద్రబాబును స్పెషల్ బ్రాంచ్‌కు, షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రదీప్ లింగంను సీపీఓకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'కాలిడోస్కోప్ 3.0'పై జాతీయస్థాయి సదస్సు


'కాలిడోస్కోప్ 3.0 సదస్సులో డాక్టర్ దిబ్యేందు ముజుందార్ రాకేషమనోచా తదితరులు

అల్వాల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అకాడమీ ఆఫ్ కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడొంటిక్స్(ఐఏసీడీఈ) సహకారంతో ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ, ఎండోడొంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'కాలిడోస్కోప్ 3.0' పై జాతీయస్థాయి సదస్సును నిర్వహించారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ) అధ్యక్షుడు డాక్టర్ దిబ్యేందు ముజుందార్ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్‌మనోచా, బ్రిగేడియర్ ప్రశాంత్ హలిగేరి, ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమతా కౌశిక్, డాక్టర్ దీపక్‌శర్మ, డాక్టర్ ఆర్ ఎస్ మోహన్‌కుమార్, డాక్టర్ గిరిష్ పర్మార్, తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

● అభ్యర్థుల నిరసన ప్రదర్శన
● అడ్డుకున్న పోలీసులు


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

చాదర్‌ఘాట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని ఓయూ జేఏసీ చైర్మన్ సురేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో డీఎస్సీ అభ్యర్థులతో ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మలక్‌పేట పోలీసులు దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వద్ద నిరసన ప్రదర్శనను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు డీఎస్సీ అభ్యర్థుల మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్యవైఖరి కారణంగా తమకు జరుగుతున్న అన్యాయాలపై కనీసం నిరసన ప్రదర్శన జరుపుకునే స్వేచ్ఛ కూడా లేదా అంటూ పలువురు అభ్యర్థులు పోలీసుల ముందు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సురేష్‌యాదవ్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ప్రకటించి మెగా డీఎస్సీ వేస్తామని విద్యార్థి, నిరుద్యోగులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించి కేసీఆర్ దారిలోనే రేవంత్ ప్రభుత్వం కూడా వెళ్తుందని విమర్శించారు. డీఎస్సీకి అవసరమైన ప్రిపరేషన్ టైమ్ ఇవ్వకుండా వరుసగా పరీక్షల షెడ్యూల్ వేస్తూ అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు సమయం కేటాయించి మెగా డీఎస్సీ ప్రకటన చేసే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కను నాటుదాం


లింగోజిగూడలో మొక్కలు పంపిణీ చేస్తున్న సామ రంగారెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం అని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం లింగోజిగూడ చౌరస్తాలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ పిలుపు మేర కు జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్‌ముఖర్జీ జయంతి ఉత్సవాలలో భాగంగా జూలై 6 వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అందులో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్ అనే కార్యక్రమాన్ని చేపట్టి దేశవ్యాప్తంగా మొక్కలు నాటాలని ప్రధాని పిలుపునిచ్చారన్నారు. తద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మొక్కలు నాటి వాటిని కాపాడటం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం కావాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బీజేపీ లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు విజయభాస్కర్, మల్కాజిగిరి కుమార్, కృష్ణంరాజు, కాకి గంగాధర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, నాగరాజు, రాకేష్‌యాదవ్, హరిప్రసాద్, భోస్లే శ్రీనివాస్, ప్రశాంతి, వంశీ పాల్గొన్నారు.

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా గురువారం వనస్థలిపురం డివిజన్ పార్టీ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంత్రిహిల్స్ కాలనీలో ఏక్ పేడ్ మా కే నామ్ అనే కార్యక్రమానికి సామ రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంరెడ్డి, మధుకర్‌గౌడ్, రాజ్‌కుమార్, బద్రరాజు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సంస్కృతం, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, స్టాటిస్టిక్స్-1 బోధన చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ గురువారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ చేసి ఉండాలన్నారు. బీసీ, ఓసీ అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇంతకు ముందు ఏదైన కళాశాలలో విద్యాబోధన చేసినట్లయితే అనుభవం సర్టిఫికెట్లు జతపరచాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్లను జూలై 2వ తేదీన హయత్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలలో సమర్పించాలని కోరారు.

హెచ్‌ఎం పీటర్ అభినందనసభ

వనస్థలిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నాగోల్ ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కాకర్లమూడి పీటర్ అభినందన సభ గురువారం నాగోల్ శుభం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన పీటర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కొనియాడారు. అనంతరం పీటర్ దంపతులను ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో భారీ పూలమాలతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ రవికుమార్, నోసా అధ్యక్షుడు కందికంటి కన్నాగౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, ఎస్‌ఎమ్‌సీ సభ్యులు జిల్కపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పల్లె లింగంగౌడ్, చంద్రశేఖర్‌ఆజాద్, అనంతుల శ్రీనివాస్‌రెడ్డి, నాళ్ల ఉమామహేశ్వర్‌గుప్తా, సిద్ది రమేష్‌గుప్తా, డప్పు రాజు, అజ్జుకిషన్, హెచ్ఎంలు విజయేందర్‌రెడ్డి, రవికుమార్, పిచ్చిరెడ్డి, కృష్ణరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

వైదేహీనగర్ సీనియర్ సిటిజన్స్ కమిటీ ఎన్నిక


వైదేహీనగర్ సీనియర్ సిటిజన్స్ కమిటీ సభ్యులు

వనస్థలిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైదేహీనగర్ సీనియర్ సిటిజన్స్ నూతన కమిటీ గురువారం ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా ఎన్.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పి.కృష్ణారావు, సభ్యులుగా వేణుగోపాల్, వెంకయ్య, ప్రకాశ్‌బాబు, శ్రీనివాసులు, భట్టార్, నాగరాజు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోగుల రాంబాబు, రాజేందర్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఎన్నికకు కృషి చేసిన సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జేఎన్‌టీయూ క్యాంటీన్‌లో ఫుడ్‌సేఫ్టీ తనిఖీలు

హైదరాబాద్ సిటీ: జేఎన్‌టీయూ క్యాంటీన్‌పై ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. క్యాంటీన్ నిర్వహణకు అవసరమైన లైసెన్స్ లేకపోవడాన్ని గుర్తించారు. వినియోగదారులకు ఆహారాన్ని అందించే సిబ్బంది తలపాగా, గ్లౌజులు, అప్రాన్లు ధరించక పోవడాన్ని అధికారులు తప్పుపట్టారు. పాక్షికంగా తయారుచేసిన ఆహార పదార్థాలు, కోసిన కూరగాయలను సరిగా కవర్ చేయకుండా ఓపెన్‌గా ఉంచారని తెలిపారు. వంటగదిలో ఆహార వ్యర్థాలు నేరుగా నేలపై పడటంతో అపరిశుభ్రత నెలకొందని వెల్లడించారు.

మరోవైపు గడువు ముగిసిన బియ్యం పిండిని పారబోశారు. వినియోగాదరులను అప్రమత్తం చేసేందుకని ఎక్స్‌వేదికగా ఫోటోలు, వివరాలను ఆహారభద్రతా కమిషనర్ వెల్లడించారు. ఇదిలా ఉంటే.. క్యాంటీన్ కాంట్రాక్టు గడువు ముగిసినా, అధికారులు కొత్త టెండర్లు పిలవపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సౌకర్యవంతంగా ఉండే ఫ్లైఓవర్లు నిర్మించాలి

● కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి


పనామా వద్ద నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలోని పనామా వద్ద ప్రజలకు ఇబ్బందికరంగా నిర్మించే అండర్‌పాస్ పనులు కాకుండా ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే ఫ్లైఓవర్లు నిర్మించాలని సంబధిత అధికారులకు విన్నవించినా కూడా మా వినతిని పట్టించుకోకుండా యథావిధంగా అండర్‌పాస్ పనులు చేపట్టడం సహించరానిదని మన్సూరాబాద్, హయత్‌నగర్ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం వారు వనస్థలిపురంలోని పనా మా వద్ద బీజేపీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పనామా వద్ద నిర్మిస్తున్న అండర్‌పాస్ పనులు చేపట్టకుండా అందరికి సౌకర్యంగా ఉండే ఫ్లైఓవర్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టిన కూడా మా వినతిని పట్టించుకోకుండా, యథావిధిగా అండర్‌పాస్ పనులు చేపట్టడం సహించరానిదని పనులను అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, నూతి శ్రీనివాస్, బండారు భాస్కర్, అంజన్‌కుమార్ గౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను పూర్తిచేయాలి


స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ సాయినగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.60లక్షలతో కొనసాగుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్(వరదనీటి కాల్వ) నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో కార్పొరేటర్ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా పనులను త్వరగా నాణ్యతగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ అధ్యక్షుడు బాల్‌రాజ్, కాలనీవాసులు రాములు, శ్రీనివాస్, పెంటయ్య, లింగయ్య నాయకులు సూర్యప్రకాష్ గుప్తా, బాలకృష్ణారెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

చంపాపేట డివిజన్‌లోని మహంకాళమ్మ తోట, హరిజనవాడబస్తీ, నవజీవనజ్యోతి సంఘం భవనం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ విద్యుత్ ఏఈ జగన్నాథ్, సూపర్‌వైజర్ హన్మంత్, భిక్షం, ఆయా బస్తీవాసులు కట్టా వెంకటేశ్, తోకటి కిరణ్, గడ్డం యాదయ్య, పోల్దాస్ లక్ష్మణ్, బాల్‌రాజ్, సందయ్య వెంకటేశ్, చంద్రశేఖర్, నాయకులు యోగిరాజ్, శేఖర్ పాల్గొన్నారు.

డ్రైనేజీలో ఇరుక్కున్న స్కూల్ బస్సు

● తప్పిన ప్రమాదం


దుర్గానగర్‌కాలనీలో డ్రైనేజీలో ఇరుక్కున్న స్కూల్ బస్సు

చంపాపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ దుర్గానగర్‌కాలనీ ప్రధాన రహదారిపై విద్యార్థులతో వెళ్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సు గురువారం డ్రైనేజీలో ఇరుక్కుపోయింది. వెనుక టైర్లు బురదలో కూరుకపోవడంతో బస్సు పక్కకు వరిగిపోయింది. దీంతో పిల్లలకు పెను ప్రమాదం తప్పినట్లయింది. రహదారిపై నున్న డ్రైనేజీలలోకి ఇష్టానుసారంగా కొత్తగా కనెక్షన్లు కలుపుతుండడంతో ఇటువంటి సంఘటనలకు దారి తీస్తుంది. వర్షాకాలం కావడంతో మట్టి తడిసి బురదమయంగా మారింది. పిల్లలను వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు చేర్చారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో మృతిచెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ మాధవరావు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుమారు 54 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున సుమారు 2.30గంటల ప్రాంతంలో చైతన్యపురి చౌరస్తా సమీపంలోని టిప్సీటాప్సీ బేకరి ఎదుట నుంచి రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని కారు అతన్ని ఢీ కొట్టి వెళ్లింది. దీంతో తీవ్రగాయాల పాలైన అతన్ని పోలీసులు 108 ద్వారా ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందాడు. అయితే మృతుడి ఆనవాళ్లను బట్టి యాచకుడిగా భావిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి ఆచూకీ కోసం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి, ఉస్మానియా మార్చురీలో మృతదేహాన్ని గుర్తించాలని ఎస్‌ఐ మాధవరావు విజ్ఞప్తి చేశారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్న జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది

వనస్థలిపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పొంగుతున్న డ్రైనేజీలు.. కంపుకొడుతున్న కాలనీలు అనే సమస్యపై గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి పలు కాలనీల్లో కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలు పరిష్కరించారు. అందులో భాగంగా ఎఫ్‌సీఐ కాలనీ, ఎన్జీవోస్‌కాలనీ ఎయిట్ వీరోడ్డు, వైదేహినగర్, కమలానగర్ తదితర కాలనీల్లో పొంగుతున్న డ్రైనేజీలో పేరుకపోయిన మట్టి, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి డ్రైనేజీ నీరు వెళ్లడానికి మార్గం సుగుమం చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో కృషి చేసిన ఆంధ్రజ్యోతి దినపత్రికకు పలు కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


కార్పొరేటర్ పవన్‌కు వినతిపత్రం ఇస్తున్న గోకుల్‌నగర్ కాలనీ ప్రతినిధులు

కాలనీలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

కొత్తపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాలనీలో పాత డ్రైనేజీ పైపుల కారణంగా నిత్యం మురుగు సమస్య తలెత్తుతున్నాయని సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కొత్తపేట గోకుల్‌నగర్ కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్ పవన్‌కుమార్‌కు విన్నవించారు. గురువారం వారు కార్పొరేటర్‌ను కలిసి సమస్యను వివరించారు. చిన్నపాటి వర్షానికే కాలనీ రహదారులు జలమయమవుతున్నాయన్నారు. వరద నీటితో పాటు మ్యాన్‌హోల్ లీకేజీతో మురుగునీరు దారులపైకి చేరుతోందని చెప్పారు. పవన్‌కుమార్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్లను వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ తర్వాత కాలనీ ప్రతినిధులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సంపత్‌యాదవ్, ప్రతినిధులు లావణ్య, మహేందర్‌యాదవ్, కాలనీలో అపార్టుమెంట్ల సమీపంలో ఉండే సిక్కులు పాల్గొన్నారు.

తారామతిపేటకు ఆర్టీసీ బస్సు ట్రిప్పులను పెంచండి


ఆర్టీసీ 2-డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ వెంకటేశ్

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట గ్రామానికి ఆర్టీసీ బస్సు ట్రిప్పులను పెంచాలని కోరుతూ స్థానిక ఎంపీటీసీ చేదూరి వెంకటేశ్ హయత్‌నగర్ ఆర్టీసీ 1, 2 డిపో మేనేజర్లకు గురువారం వినతి పత్రం అందజేశారు. స్కూల్స్, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో తారామతిపేట గ్రామంతో పాటు సమీప గ్రామాల నుంచి వందలాది మంది విద్యార్థులు నగరానికి వెళ్లి వస్తున్నారని తెలిపారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రిప్పుల సంఖ్య తక్కువగా ఉండడంతో విద్యార్థులు కిక్కిరిసిన ప్రయాణం చేయాల్సివస్తోందని తెలిపారు. విద్యార్థుల, ప్రయాణికుల సమస్యను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7గంటల నుంచి 9, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 7గంటల వరకు బస్సుల ట్రిప్పులను పెంచాలని కోరారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు


సత్యనారాయణస్వామి వ్రతాలలో దంపతులు

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): లలితానగర్‌లో గడ్డిఅన్నవర క్షేత్ర వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వ్రతాలలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పూర నర్సింహగుప్తా, వైస్ చైర్మన్ పాల్తి శ్రీనివాస్‌లు ఆయనకు స్వామి వారి జ్ఞాపికను అందజేసి, సత్కరించారు. పూజ కార్యక్రమాల్లో ప్రముఖ పండితులు శ్రీరామ చరణ్‌శర్మ, ఆలయ ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, ఆలయ కమిటీ సలహాదారులు చకిలం రమణయ్య, మాజీ చైర్మన్ వక్కలంక శ్రీనివాస్‌రావు, పాండు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేటు స్కూల్‌పై చర్యలు తీసుకోండి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాముల గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఎక్సెల్సియా స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సదరు స్కూల్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా స్కూల్‌ను నిర్వహించడంతో పాటు నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థుల నుంచి లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులను నిలువుదోపిడీ చేస్తున్న స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుని అవసరమైతే స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోలపై ప్రత్యేక డ్రైవ్

● నిబంధనలు పాటించని 621 మందిపై కేసులు నమోదు


స్కూల్ ఆటోను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసు

హైదరాబాద్ సిటీ: స్కూలు పిల్లలను తరలిస్తున్న ఆటోలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు 3.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్ ఆటోలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటో నడుపుతున్న 11 మంది, ఎక్కువ మంది స్కూలు పిల్లలను తరలిస్తున్న 95 మందిపై, ఒక మైనర్ ఆటోడ్రైవర్‌పై, పైలెట్ డ్రైవర్‌ను కలిగిఉన్న 57 మందిపై, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న 40 మందిపై, యూనిఫాం ధరించని 406 మందిపై, డాక్యుమెంట్లు లేకుండా ఆటోలను నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేశారు. స్కూల్ ఆటోల్లో విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు గమనిస్తుండాలని అడిషనల్ సీపీ ట్రాఫిక్ పి.విశ్వప్రసాద్ తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను ఆటోలో తరలించకుండా చూడాలని సూచించారు.

భూ కబ్జాల నిరోధక చట్టాన్ని పునరుద్ధరించాలి

చాదర్‌ఘాట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పేదలు, అమాయక ప్రజల భూములను పరిరక్షించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హయాంలో తీసుకువచ్చిన భూ కబ్జాల నిరోధక చట్టాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈమెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. అనంతరం మలక్‌పేటలోని కల్యాణ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1982లో తీసుకురాబడిన భూ కబ్జాల నిరోధక చట్టం వల్ల ఎంతో మంది అమాయక ప్రజల భూములు సంరక్షించబడ్డాయన్నారు. పేదల భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడ్డాయని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2016లో ఈ యాక్ట్‌ను చట్ట వ్యతిరేకంగా కేవలం ఒక జీవోతో రద్దు చేసిందని వివరించారు. దీంతో అప్పటి నుంచి పలుకుబడి ఉండి ప్రభుత్వం, అధికారుల అండదండలున్న ఆక్రమణదారులు ప్రజల భూములను ఆక్రమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.